
# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

మంగళవారం | 25 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..

# బీఆర్ఎస్ నేతల సహకారంతో...!

# బడా నిర్మాణ సంస్థ బరితెగింపు

## డిసిపి కార్యాలయం కూల్చేసింది..!ఈ అక్రమార్కుల అప్రోచ్ రోడ్డు కోసమేనా..?

నోట్ల కట్టలు పడేసే బడా నిర్మాణ సంస్థలకు.. జీహెచ్ఎంసి అధికార యంత్రాంగం జీహుజూర్ అంటూ..! సలాం కోడుతూ సహకరిస్తుందని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. అర్హత లేకపోయినా వక్రమార్గంలో అక్రమ అనుమతులు మంజూరు చేయడంలో జీహెచ్ఎంసి ముందుంటుంది.. ఫాక్స్‌సాగర్ లాంటి చారిత్రక చెరువు, నాలాలు, వెన్నెలగడ్డ (ఎన్నా) చెరువు కబ్జాలకు జీహెచ్ఎంసి ప్రధానకార్యాలయం కీలక పాత్ర పోషిస్తుంది.. అందుకు కళ్ళ ముందే నిర్మాణాలు సాక్షాత్కరిస్తున్నాయి.. అధికారుల అక్రమార్జనకు కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను సైతం, వాళ్ళ తాతల ఆస్తుల వలె కట్టబెట్టడం పరిపాటిగా మారింది.. నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను బ్రష్టుపట్టించే ఓ ప్రజాప్రతినిధి అండతో, బీఆర్ఎస్ హయాంలోనే ఈ బడా నిర్మాణ సంస్థ కబ్జాకు శ్రీకారం చుట్టింది..! ప్రభుత్వ భూమిలో, ట్రాఫిక్ డిసిపి కార్యాలయం నిర్మించారని అప్పట్లో కూల్చివేసిన రెవెన్యూ అధికారులు.. ఓ బడా నిర్మాణ సంస్థ సుమారు 5325 గజాల స్థలాన్ని, కబ్జా చేస్తుంటే "బెల్లం కొట్టిన రాయిలా" ఉండటంలో ఆంతర్యం..? లంచాలు పుచ్చుకుని వదిలేశారా..? ఒక ప్రభుత్వ ట్రాఫిక్ డిసిపి కార్యాలయ నిర్మాణం అక్రమం అయినప్పుడు..! బడా నిర్మాణ సంస్థకి సక్రమం ఎలా అయింది కలెక్టర్ సర్.. విధుల పారదర్శకత అంటే ఇదేనా.. జిల్లా ఉన్నతాధికారుల మౌనం అంగీకారమా..? అధికారులుగా "రైట్ అంటే రైట్,-రాంగ్ అంటే రాంగ్" ఇదేనా..? అహంకార పూరితంగా ప్రజల ఆస్తులను అక్రమార్కులకి కట్టబెట్టడమే అధికారుల విధులా..?

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 24:

సర్వే నెం.23 ప్రభుత్వ భూమిని అప్రోచ్ రోడ్డుగా చూపించిన మైసా కన్‌స్ట్రక్షన్..





గతంలో డిసిపి కార్యాలయం కూల్చివేసిన రెవెన్యూ అధికారులు..

- పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమిలో 5325 గజాల కబ్జాపై ప్రజావాణిలో ఫిర్యాదు..
- బీఆర్ఎస్ హయాంలో ఓమాజీ మంత్రి ఒత్తిడితో ట్రాఫిక్ డిసిపి కార్యాలయం కూల్చివేత..
- అదే ప్రభుత్వ స్థలాన్ని అప్రోచ్ రోడ్డుగా చూపించిన బడా నిర్మాణ సంస్థకు ధారాదత్తం..
- సర్వే నెం.23 ప్రభుత్వ స్థలంలో ఉన్న డిసిపి ఆఫీస్ కూల్చివేసింది..ఈ అక్రమార్కుల కోసమా..?
- ప్రభుత్వ కార్యాలయాన్ని కూల్చివేసింది అక్రమార్కులకి కట్టబెట్టేందుకేనా..?
- జీహెచ్ఎంసి నుంచి అనుమతులతో.. 1200 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణ..?
- అప్రోచ్ రోడ్డు కోసం సర్వే నెం.23లో మరో ఎకరం ప్రభుత్వ భూమి కబ్జా..!!
- అసలు అప్రోచ్‌రోడ్డు లేకుండానే అనుమతులు ఎలా ఇచ్చారని ప్రజావాణిలో ఫిర్యాదు..

-2లో

## మార్చి 31లోపు రైతులందరి ఖాతాల్లో

# 'రైతు భరోసా' డబ్బులు



హైదరాబాద్ పెన్ పవర్: మార్చి 31 లోపు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంచిర్యాలలో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభ వేదికగా సీఎం రేవంత్ ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో మూడెకరాల భూమి ఉన్న రైతులకు

-3లో


# మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్!

- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- ఫిబ్రవరి 25 సాయంత్రం నుండి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బంద్
- మద్యం దుకాణాలతో పాటు కల్లు దుకాణాలు, బార్లు కూడా బంద్

-4లో




# బీఆర్ఎస్ నేతల సహకారంతో..! బడా నిర్మాణ సంస్థ బరితెగింపు..!!










## సర్వే నెంబర్ 23 ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం..

పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 23 ప్రభుత్వ భూమిలో మొత్తం 05-25 ఎకరాలు ఉండగా.. 1200 గజాలు ఆక్రమించుకొని క్యాడల్ మైసా కన్‌స్ట్రకన్ అక్రమ అనుమతులతో నిర్మాణం చేపట్టి..! సుమారు 4125 గజసల ప్రభుత్వ భూమినీ అప్రోచ్ రోడ్డుగా చూపించు కోవడం కోసం..! నిబంధనలకు విరుద్ధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల సహకార లభించిందని సతీష్ ఆరోపించారు.. ఈ ప్రభుత్వ భూమిలో కొంత భూమిని ఓ ప్రవేట్ స్కూల్‌కి ధారాదత్తం, మరికొంత ఎన్‌సిఎల్ కాలనీ పార్కు ఏర్పాటు.. కొన్ని ఇళ్ళ నిర్మాణాలు, ఓ ప్రైవేటు ఆసుపత్రికి కొంత ఆక్రమించుకొని గతంలో నిర్మాణాలు చేపట్టారని సతీష్ ఆరోపించారు.. కానీ క్యాడల్ మైసా కన్‌స్ట్రక్షన్ సర్వే నెంబర్ 12, 24లో ప్రైవేటు భూమిని చూపిస్తూ, ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 23లో కొంత ఆక్రమించుకొని, 24లో చూపిస్తూ జిహెచ్ఎంసి నుంచి 10 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు (1/C25/03336/2020) పొందడం విశేషం.. సదరు కబ్జా స్థలంలో బీటీ రోడ్డు కూడా దర్జాగా వేసుకోవడంపై అధికారులు చర్యలు చేపట్టాలని సతీష్ విజ్ఞప్తి చేశారు. కావున, తక్షణమే సర్వే నెంబర్ 23లో క్యాడల్ మైస కన్‌స్ట్రకన్ ఆక్రమించుకున్న స్థలం గుర్తించడం కోసం సర్వే నిర్వహించాలని కోరారు.. అక్రమ అనుమతులు పొందిన మైస కన్‌స్ట్రకన్ కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో అమలేశ్వరి,అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు

## నిబంధనలు గుంతలో తొక్కి.. అనుమతులు మంజూరు..

జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అనుమతులు అంటేనే తప్పుడు అనుమతులకు కేరాఫ్ అడ్రస్‌గా తయారైంది..? సర్వే నెంబర్ 12, 24 పట్టా భమిలో క్యాడల్ మైసా నిర్మాణ సంస్థ అక్రమంగా అనుమతులు పొందేందుకు సర్వే నెంబర్ 23 ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అప్రోచ్ రోడ్డుగా చూపించడానికి..! మాజీ మంత్రితో పాటు, స్థానిక ఎమ్మెల్యే కూడా సహకరించినట్లు సతీష్ ఆరోపించారు.. నిర్మాణంలో 1200 గజాలు ఆక్రమించి కన్‌స్ట్రక్షన్ చేశారని..! అప్రోచ్ రోడ్డుకోసం సుమారు 4125 గజాలు ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.. సంబంధిత కబ్జాస్థలంలో దర్జాగా బీటీ రోడ్డు నిర్మాణం చేసుకోవడం గమనార్హం..అక్రమ అనుమతుల నిర్మాణంపై సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమిని గుర్తించాలని, ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఆకుల సతీష్ సోమవారం ఫిర్యాదు చేశారు..

## కబ్జాదారుల కోసం..! డిసిపి కార్యాలయం కూల్చివేత..

పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 23 ప్రభుత్వ భూమిలో ట్రాఫిక్ డిసిపి కార్యాలయం నిర్మించారని..! బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ మాజీ మంత్రి ఒత్తిడి మేరకు, డిసిపి కార్యాలయాన్ని కూడా నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిన సంబంధిత అధికారులు.. క్యాడల్ మైసా కన్‌స్ట్రక్షన్ కంపెనీ అప్రోచ్ రోడ్డుకు లైన్ క్లియర్ కోసమే నని స్పష్టమవుతుంది.. ప్రభుత్వ భూమిలో, ప్రభుత్వ కార్యాలయం(ట్రాఫిక్ డిసిపి) నిర్మాణానికి అర్హత లేదని కూల్చేశారు సరె..! కానీ కబ్జాదారులకు ఏ అర్హత ఉందని ప్రభుత్వ భూమిని కట్టబెడుతున్నారు..? బడా నిర్మాణ సంస్థ ప్రలోభాలకు కమిట్ అయ్యారా..? కబ్జాదారులకు లేని ఆంక్షలు, డీసీపీ కార్యాలయం నిర్మాణానికి ఏలా..?

## పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అండతో, అత్యంత ఖరీదైన, సుమారు 5325 గజాలు(ఎకరం పైచిలుకు) ప్రభుత్వ భూమి కబ్జాకు స్కెచ్ వేశారని మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం ఆకుల సతీష్ టీమ్ ఫిర్యాదు చేశారు.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ సర్వేనెంబర్ 23 ప్రభుత్వ భూమిని(5325 గజాలు) ఓ బడా నిర్మాణ సంస్థ దర్జాగా కబ్జా చశారు.. సుమారు 1200 గజాలు ఆక్రమించి నిర్మాణం చేపట్టగా..! ఎకరం పైచిలుకు అప్రోచ్ రోడ్డుగా చూపించుకున్నారు.. సదరు సర్కార్ జమీన్‌ను,ఈ బడా కన్‌స్ట్రకన్ కంపెనీకి కట్టబెట్టేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీజం వేశారని ఆకుల సతీష్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కబ్జాలకు కేంద్ర బిందువుగా మారింది.. అక్రమార్కుల అత్యుత్సాహం..! ప్రజాప్రతినిధుల సిఫార్సులు..! అధికారుల సహకారాలు..! వెరసి ప్రభుత్వ ఆస్తులకు శఠగోపం..! ప్రశ్నిస్తే అధికారుల సమాధానం శూన్యం..! దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా నేతలు, కబ్జాదారులు,అధికారులు, కంచే చేనుమేస్తే ఇక కాపాడేదెవరు..? గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు నాయకుల భూ కబ్జాలు, దౌర్జన్యాలకు ప్రజలు స్వస్తి పలికినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కూడా కబ్జాలు మాత్రం నియంత్రించ లేక పోతున్నారు.. ప్రభుత్వాలు మారినా అక్రమార్కుల ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి.. కబ్జాలు బడా బాబులవి..! చర్యలు మాత్రం సామాన్యులవి..! అన్నట్టు తయారైంది.. నిబంధనలతో పనిలేకుండా, అక్రమంగా పట్టణ ప్రణాళిక అనుమతులు మంజూరు.. అప్రోచ్ రోడ్డుకోసం ప్రభుత్వ స్థలాలు బరితెగించి కబ్జాచేస్తున్న బడా నిర్మాణ సంస్థలు.. మామూళ్ళ మత్తులో అధికార యంత్రాంగం..!



ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్..

# ప్రభుత్వ పాఠశాలను.. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

**విద్యార్థుల భవిష్యత్తుకు మార్గాన్ని నిర్దేశించే విధంగా హెడ్‌మాస్టర్ చర్యలు చేపట్టాలి..**





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 24:** పదవ తరగతి అనంతరం ఏ దిశగా వెళ్లాలనే అంశంపై విద్యార్థులకు క్షుణ్ణంగా అర్థమయ్యేలా మార్గనిర్దేశం చేసి వారి భవిష్యత్తుకు చేయుతను అందించేలా అన్ని పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోత్రు సూచించారు.. సోమవారం కూకట్ పల్లి మండలం ఎల్లమ్మబండ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి తరువాత ఏ కోర్సు తీసుకోవాలి అనే అంశంపై వారికి క్షుణ్ణంగా అర్థమయ్యేలా దిశ నిర్దేశం చేయాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు మంచి కోర్సులను ఎంచుకొని మంచి భవిష్యత్తులు ఏర్పాటు చేసుకునేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ విద్యార్థులకు తెలిపారు. పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు విద్యకు అవసరమైన సలహాలను కలెక్టర్ విద్యార్థులకు వివరించారు.

## పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్..

కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. సిలబస్ పూర్తైందా అని, రివిజన్ ఎలా జరుగుతుం దని, స్కూల్లో వసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అంతకు ముందు రాష్ట్ర విద్యాశాఖ ద్వారా అందజేసే ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ద్వారా, పాఠశాలలో భాషా గణిత సామర్థ్యాలలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేకమైన టూల్ ద్వారా విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబును కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. ప్రతి విద్యార్థి 20 నిమిషాల నిడివితో పాఠలు వినాలని తప్పనిసరిగా నాలుగురోజులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ద వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్యాంప్రకాష్, తహసీల్దారు స్వామి, డిఈఓ విజయ కుమారి, పాఠశాల హెడ్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు..





# మార్చి 31లోపు రైతులందరి ఖాతాల్లో 'రైతు భరోసా' డబ్బులు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఇప్పటికే జమ చేసిన సంగతి తెలిసిందే. రూ. 1,230.98 కోట్లను ప్రభుత్వం రైతుల అకౌంట్లలో వేసింది. దీంతో ఇప్పటి వరకు మొత్తం 44.82 లక్షల మంది రైతులకు రూ. 3,487.82 కోట్ల రైతు భరోసా నిధులు అందాయి. జనవరి 26న పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామానికి రూ. 568.99 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసి ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఫిబ్రవరి 5న రాష్ట్రవ్యాప్తంగా ఒక ఎకరం వరకు ఉన్న 17 లక్షల మంది రైతులకు చెందిన 9.29 లక్షల ఎకరాల భూమికి గాను రూ. 557.54 కోట్లు జమ చేశారు. రెండెకరాల వరకు ఉన్న రైతులకు ఫిబ్రవరి 10న 13.23 లక్షల మందికి, ఫిబ్రవరి 12న రికార్డులు అప్‌డేట్ చేసిన 56 వేల మంది రైతులకు రూ. 38.34 కోట్లతో కలిపి మొత్తం రూ. 1,130.29 కోట్లు నిధులు జమ చేశారు. అదే రోజు మూడెకరాల వరకు ఉన్న 9.56 లక్షల మంది రైతులకు చెందిన 20.51 లక్షల ఎకరాలకు రూ. 1,230.98 కోట్లు నిధులను డైరెక్ట్ బెనిఫీషియరీ ట్రాన్స్‌ఫర్ ద్వారా రైతు ఖాతాల్లో వేశారు. దీంతో ఇప్పటి వరకు 44.82 లక్షల మంది రైతులకు చెందిన 58.13 లక్షల ఎకరాలకు రైతు భరోసా కింద రూ. 3,487.82 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. మార్చి 31 లోపు మిగతా వారికి నిధులు విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ప్రకటించారు.

# విద్య బలమైన ఆయుధం:గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..

## కూకట్‌పల్లి ఎల్లమ్మబండలో అక్షయ విద్యా కమ్యూనిటీ ప్రారంభించిన గవర్నర్..










**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్,ఫిబ్రవరి 24:** విద్య బలమైన ఆయుధమని ఈ ఆయుదాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.. సోమవారం కూకట్ పల్లి మండలంలోని ఎల్లమ్మ బండలో అక్షయ విద్య కమ్యూనిటి లెర్నింగ్ అండ్ స్కిల్స్ ట్రైనింగ్ సెంటర్‌ను గవర్నరు ప్రారంభించారు. ఈ కమ్యూనిటి హాల్‌లో చిన్నారులకు అవసమైన మౌళిక వసతులు ఏర్పాటు చేసారన్నారు. చిన్న చిన్న ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1 నుండి 6 వతరగతి చిన్నారులకు ప్రతిరోజు సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు ఉచితంగా ఇక్కడ చదువు చెప్పడం ఎంతో హర్షనీయమని గవర్నర్ కొనియాడారు.. ఈ ప్రాంతంలో ఇంటర్ డిగ్రీ చదువుకునే విద్యార్థులే వీరికి పాఠాలు చేప్పడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.. ఈ విద్యా సెంటర్‌ను నిర్వహిస్తున్న అక్షయ ఫౌండేషన్ వారికి గవర్నర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ అరికెపూడి గాంధీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం, అక్షయ పౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్!

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో మద్యం దుకాణాలు మూడు రోజులు మూతపడనున్నాయి. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. తెలంగాణలోని ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే తేదీతో పాటు, ముందుగా రెండు రోజులు కూడా మద్యం దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ క్రమంలో ఫిబ్రవరి 25 సాయంత్రం 27వ తేదీ వరకు మద్యం దుకాణాలు తెరుచుకోవని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. ఫిబ్రవరి 25 సాయంత్రం 4 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి.

# కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతి నెల రూ.600 కోట్ల వడ్డీని చెల్లిస్తున్నాం: రేవంత్ రెడ్డి

- కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారన్న రేవంత్ రెడ్డి
- ఉద్యోగులకు ఎప్పుడూ మొదటి తారీఖున వేతనాలు ఇవ్వలేదని విమర్శ
- పదేళ్లలో కేసీఆర్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని విమర్శ



మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని, వారు చేసిన అప్పులకు ప్రతి నెల రూ.600 కోట్ల వడ్డీని చెల్లిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ తన పదేళ్ల కాలంలో ఉద్యోగులకు ఎప్పుడూ మొదటి తారీఖున వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు.పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలకు ఏమీ చేయని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమను తప్పుబట్టడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. ఏడాదిలోనే తాము ఏమీ చేయలేదని చెప్పడమేమిటని ప్రశ్నించారు. పదేళ్ల పాటు కేసీఆర్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని, ఇచ్చిన తమపై కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చిందని ఆయన వెల్లడించారు. 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు.ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే వారికి ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారని విమర్శించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించలేదని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని పూర్తిచేశామని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన మేరకు తమ ప్రభుత్వం కులగణన చేపట్టిందని ఆయన అన్నారు. దేశంలో ఎవరూ చేయలేని సాహసం తాము చేశామని ఆయన అన్నారు. వందేళ్లుగా జరగని కులగణనను తాము సమర్థవంతంగా నిర్వహించామని అన్నారు. ప్రజలు తిరస్కరించినప్పటికీ కేసీఆర్‌లో మార్పు రాలేదని విమర్శించారు. కేసీఆర్ అవసరం రాష్ట్రానికి లేదని ప్రజలు తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకోమని చెప్పారని వ్యాఖ్యానించారు. కానీ కేసీఆర్ మాత్రం ఫామ్ హౌస్‌లో కూర్చొని ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంతో పేగు బంధం తెంచుకొని పార్టీ పేరును కూడా మార్చుకున్నారని విమర్శించారు. ఏడాది కాలంలో తాము ఎన్నో చేశామని, వాటిని నెరవేర్చామని భావిస్తేనే తమకు ఓటు వేయాలని రేవంత్ రెడ్డి అన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం.

**జగిత్యాల: పెన్ పవర్:** ఉద్యోగుల,ఉపాధ్యాయుల ,పెన్షనర్ల, అధికారుల సమస్యలన్నీ పరిష్కారామావుతాయని టీ.ఈ.జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జెనరల్ ఏలూరు శ్రీనివాస్ రావు లు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని టీ.ఎన్.జీ ఓ.ల జిల్లా సంఘ భవన్ లో పత్రికా సమావేశంలో వారు మాట్లాడారు.కొద్ది రోజుల ముందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ప్రస్తుత ఉద్యోగుల,ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలయిన పెండింగ్ డి.ఏ.లు, పీ.ఆర్.సీ, సీ.పి.ఎస్.రద్దు, ఈహెచ్ యస్ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపుల మరియు వివిధ శాఖల సమస్యలపై చర్చలు జరిపామన్నారు. ముఖ్యమంత్రి తాము చర్చించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారని, తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని,ఎవ్వరూ ఆందోళన చెందవద్దని ,వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే మరో రెండు మూడు నెలల్లో పెండి బిల్లులు లేకుండా చేస్తామని , అన్ని సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.అలాగే వచ్చే ఏప్రిల్ లేదా మే మాసం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా ఎల్.బి.స్టేడియంలో భారీ సదస్సు నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.టీ.జి.ఉద్యోగ సంఘాల జేఏసీ ఎల్లప్పుడూ ప్రభుత్వం లో భాగస్వామ్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ను అభివృద్ధి పథంలో అగ్రగామిగా చేయడానికి అహర్నిశలు కృషిచేస్తామని తెలిపారు. అనంతరం టీ.ఎన్.జీ.ఓ.ల జిల్లా శాఖ పక్షాన




జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి,గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవి బాబు టీ పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ సమస్యలను వివరిస్తూ పరిష్కారం కోసం టీ.ఈ.ఉద్యోగ జేఏసీ రాష్ట్ర నేతలు చేస్తున్న కృషి పట్ల కృతజ్ఞతలు తెలిపారు.టీ ఉద్యోగుల జేఏసి జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి,,గెజిటెడ్ అధికారుల జిల్లా పక్షాన జిల్లా అధ్యక్షుడు కందుకూరు రవి బాబు,పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా పక్షాన జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, నాల్గవ తరగతి ఉద్యోగుల పక్షాన జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య,వివిధ సంఘాల ప్రతినిధులు ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్,సెక్రటరీ జెనెరల్ ఏలూరు శ్రీనివాస్ రావు, టిజిఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ,తదితర రాష్ట్ర నాయకులని ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో టీ గెజిటెడ్ అధికారుల సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ, టీ.ఈ.జేఏసి.జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి,గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవి బాబు, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,టీ.ఎన్.జీ.ఓ.కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, టిజిఓ జగిత్యాల జిల్లా కార్యదర్శి మామిడి రమేష్, పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,సహా అధ్యక్షుడు పి.హన్మంత్ రెడ్డి, క్లాస్ ఫోర్ సంఘం అధ్యక్షులు చంద్రయ్య, వేణు, టిఎన్జిఓ మరియు టిజిఓ నాయకులు జిల్లా,వివిధ యూనిట్ల,ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల,సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గల్ఫ్ లో పెంచిన ఇండియన్ పాస్‌పోర్ట్ ఫీజును తగ్గించాలి

## పేద గల్ఫ్ కార్మికులపై నాలుగు రెట్ల ఫీజుల భారం

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం కొత్త అవుట్‌సోర్సింగ్ విధానంతో గల్ఫ్ దేశాలలో పాస్ పోర్ట్, కాన్సులర్ సేవలను ప్రైవేటీకరించి నాలుగు రెట్ల ఫీజులు పెంచడం పట్ల ప్రవాసి కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పెంచిన పాస్ పోర్ట్,కాన్సులర్ సేవల ఫీజులను వెంటనే తగ్గించాలని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కు సోమవారం మెయిల్ ద్వారా, 'ఎక్స్' వేదిక ద్వారా విజ్ఞప్తి చేశారు.విదేశీ మారక ద్రవ్యాన్ని పొందే దేశాలలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. ప్రవాస భారతీయులు 2024లో 129 బిలియన్ యుఎస్ డాలర్ల (11 లక్షల 22 వేల కోట్ల రూపాయల) విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని భారత్ కు పంపారు. ఇది భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.4 శాతం.ఇందులో సగానికి పైగా సొమ్ము యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఓమాన్, ఖతార్, బహరేన్ ఆరు అరబ్ గల్ఫ్ దేశాల నుంచే వచ్చింది. ప్రవాసి కార్మికులు దేశానికి ఆర్థిక జవాన్లుగా నిలుస్తున్నారు. గల్ఫ్ దేశాలలో 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని భారత ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.ఏటా 26.6 బిలియన్ యూఎస్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్న బంగ్లాదేశ్ ప్రపంచంలో ఆరవ స్థానంలో ఉన్నది. విదేశాల నుంచి ఫారెక్స్ పంపిస్తున్న తమ ప్రవాసీలకు బంగ్లాదేశ్ ప్రభుత్వం 2.5 శాతం ప్రోత్సాహకం ఇస్తున్నది. మనకంటే చాలా చిన్న దేశం బాంగ్లాదేశ్ తమ ప్రవాసులకు ప్రోత్సాహకాలు ఇస్తుంటే భారత్ మాత్రం ఎన్నారైలను పీడిస్తున్నదని భీంరెడ్డి అన్నారు. ఇప్పటికే తక్కువ వేతనాలు, జీతం దొంగతనం (వేజ్ థెఫ్ట్),రుణ బానిసత్వం, బలవంతపు శ్రమ, పెరుగుతున్న జీవన వ్యయంతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు పాస్ పోర్ట్, కాన్సులర్ సేవల ఫీజుల పెంపు మరింత అన్యాయం చేస్తుంది. ప్రవాసి కార్మికులు తమ ఆరోగ్యాన్ని,యవ్వనాన్ని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసినందుకు వారికి భారత ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని మంద భీంరెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవాసి కార్మికులకు సహాయం చేయడానికి బదులుగా, వారిని ప్రైవేట్ ఔట్ సోర్సింగ్ కంపెనీలకు ఆదాయ వనరులుగా మారుస్తున్నారని ఆయన విమర్శించారు.

గల్ఫ్ దేశాలలో ఇండియన్ పాస్ పోర్ట్, కాన్సులర్ సేవల ఫీజు పెంపు ఈ విధంగా ఉన్నది. సౌదీ అరేబియా లో 200 -300 రియాళ్లు (గతంలో 50-75), యూఏఈ లో 200-350 దిర్హములు (గతంలో 50-100), ఓమాన్ లో 25-35 రియాళ్లు (గతంలో 5-10), బహరేన్ లో 20-30 దీనార్లు (గతంలో 5-10), ఖతార్ లో 150-200 రియాళ్లు, కువైట్ లో 23.750 దీనార్లు వసూలు చేస్తున్నారు.

గల్ఫ్ కార్మికుల జీవితాలపై ప్రభావం చూపే ఇంత ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను,వలస కార్మికుల హక్కుల సంఘాలను, పౌర సమాజ సంస్థలను, వలస కార్మికులను ఎందుకు సంప్రదించలేదు. పారదర్శకత, వాటాదారుల ప్రమేయం లేకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని భీంరెడ్డి డిమాండ్ చేశారు.

## వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ

**హైదరాబాద్ పెన్ పవర్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని స్తానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్,రామగుండం కార్పొరేటర్ అడ్డా రామస్వామి తో కలిసి ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఆనాడు ఎందరో త్యాగధనుల విగ్రహాలు ట్యాంక్ బండ్ పై పెట్టిన గత ముఖ్యమంత్రులు వాల్మీకి మహర్షి విగ్రహాన్ని విస్మరించడం సిగ్గు చేటన్నారు.ఈరోజు ఎల్లమ్మ బండలో బోయ కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించడం గొప్ప పరిణామం అన్నారు.ఇప్పటికైనా రేవంత్ రెడ్డి నేతృత్వంలో ట్యాంక్ బండ్ పై మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించాలని కోరారు.అదేవిధంగా బోయ కులస్తులను గత ప్రభుత్వాలు విస్మరించాయని ఇప్పటికయినా బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి పార్లమెంట్ కి పంపాలని కోరారు.

## నర్కుడలో కుటుంబం అదృశ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి నర్కుడ గ్రామంలో ఓ వ్యక్తి కుటుంబసభ్యులతో సహా అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుదర్శన్ వివాహం అయ్యాక సంవత్సరం పాటు గ్రామంలోనే నివాసం ఉన్నాడు. తరువాత తన అత్తగారి నివాసమైన హైదరాబాద్ కర్మాన్ఘాట్ ప్రాంతానికి మకాం మార్చాడు. అయితే అక్కడ తెలిసిన వారి వద్ద అప్పులు చేసి అక్కడ నుండి శంషాబాద్ లో నివాసామున్నాడు. అయితే అక్కడకూడా ఆదే సీన్ రిపీట్ కావడంతో నర్కుడా గ్రమానికి మకాం మార్చాడు. మూడు సంవత్సరాలు నర్కుడా గ్రామంలో బార్యాపిల్లలతో కాపురం పెట్టాడు. అయినా కూడా సుదర్శన్ లో మార్పు రాలేదు అక్కడ కూడా ఉబ్బడి మబ్బడిగా అప్పులు చేశాడు. అయితే ప్రభాకర్ అనే వ్యక్తి సుదర్శన్ కుటుంబ సభ్యులలకు 2 లక్షల బాకీ ఉన్నట్లు ఫోన్ రావడంతో కంగుతిన్నారు. ప్రభాకర్ సుదర్శన్ ఇంటికి వచ్చి ఇన్ క్వేరి చెయ్యడంతో ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో సుదర్శన్ కుటుంబ సభ్యులు శంషాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అక్షయ ఫౌండేషన్ భవంతిని ప్రారంభించని గవర్నర్ విష్ణు దేవ్ వర్మ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆల్విన్ కాలనీ డివిజన్ లోని పీజేఆర్ నగర్ లో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన బిల్డింగ్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ బిష్ణు దేవ్ వర్మ, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు దేశంలో నాణ్యమైన విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దీనిలో భాగంగా అక్షయ విద్య ఫౌండేషన్ కూడా ముందుకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగించింది అని అన్నారు. విద్య అనేది ప్రపంచాన్ని మార్చేందుకు ఒక ఆయుధాలు లాగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. చదువుకునే సమయంలో విద్యార్థులకు అండగా ఉండి అర్థమయ్యే విధంగా వారికి చెప్తే ఉన్నత స్థాయికి ఎదిగేలా వారు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య పాటు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## కార్మికుల సంక్షేమంపై రేవంత్ ఆరా

**మహబూబ్ నగర్ ఫిబ్రవరి 24, పెన్ పవర్:**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ఘోర ప్రమాదం గురించి దేశమంతా చర్చించుకుంటోంది. అయితే, ఇంతటి భారీ టన్నెల్‌ను తవ్వే టన్నెల్ బోరింగ్ మెషీన్ ఎలా ఉంటుంది? టన్నెల్ కోసమే తయారుచేసిన ఈ మెషీన్ స్వరూపం ఎలా ఉంటుంది? ఇప్పుడు ఇవే అంశాలు కీలకం. టన్నెల్‌లో జరిగిన ప్రమాదానికి ఆ బోరింగ్ మెషీన్ కూడా దెబ్బతిన్నదని అంటున్నారు. అసలు టన్నెల్ బోరింగ్ మెషీన్ ఎలా ఉంటుందో చూద్దాం..శ్రీశైలం కొండను తవ్వుతున్న బోరింగ్ మెషీన్ అటూఇటూగా ఇలాగే ఉంటుంది. ఎస్ఎల్‌బీసీ భూగర్భాన్ని తొలిచేస్తూ, టన్నెల్‌ను నిర్మించడంలో బాహుబలి వంటి ఈ బోరింగ్ మెషీనే కీలకం. శ్రీశైలం దగ్గర దోమలపెంటలో ఉన్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణానికి వాడుతున్న అర్ధచంద్రాకారంలో ఉన్న సిమెంట్ దిమ్మెలు ఇవే. వీటిని ఉపయోగించి సొరంగాన్ని వృత్తాకారంగా ఇలా పకడ్బందీగా నిర్మిస్తున్నారు. 10 మీటర్ల వ్యాసంతో ఉన్న టన్నెల్ నిర్మించాలంటే, ఈ కొండల్లోని శిలలను తవ్వాలి. ఇది మనుషులు చేసే పనికాదు. భారీ యంత్రాలను ఉపయోగించి తవ్వాలి. అయితే ఇవి మార్కెట్లలో లభించేవి కావు. తవ్వాల్సిన టన్నెల్ కోసం, అక్కడి భూమి, శిలలు వంటి భౌగోళిక స్వరూపానికి తగ్గట్లుగా టన్నెల్ బోరింగ్ మెషీన్‌ను ప్రత్యేకంగా తయారు చేయాల్సి ఉంటుంది.బోరింగ్ మెషీన్ ఇలా భారీ పైప్‌లా ఉంటుంది. ఇది కొండను తొలుస్తుంది. అతి భారీ నిర్మాణంతో ప్రత్యేకంగా రూపొందించిన ఈ బోరింగ్ మెషీన్ ముందున్న బ్లేడ్స్- బండరాళ్లు, మట్టిని తొలుచుకుంటూ ముందుకు వెళుతుంది. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ పాయింట్ నుంచి 14 కిలోమీటర్ల వరకు ఇలాంటి యంత్రమే తవ్వింది. ఈ బోరింగ్ మెషీన్ కొండను తొలుస్తున్న సమయంలో వచ్చే మట్టిపెళ్లలు, బండరాళ్లను ఇలాంటి కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తారు. మట్టిని బయటకు పంపించిన తర్వాత, టన్నెల్‌ని నిర్మించడానికి ప్రత్యేకంగా సిమెంట్ బ్లాక్స్‌ను తయారుచేస్తారు. ఆ సిమెంట్ బ్లాక్స్‌ను ఇలా టన్నెల్‌కు కవచంగా ఫిట్ చేస్తారు. తద్వారా భూ ఉపరితలం నుంచి వచ్చే ఒత్తిడిని ఈ సిమెంట్ బ్లాక్స్ తట్టుకునేలా నిర్మాణం సాగుతుంది. అలాగే భూమి పొరల నుంచి లీక్ అయ్యే నీటిని ఇవి అరికడతాయి. నీటి ఊట వల్ల ఈ సొరంగం దెబ్బతినకుండా ఈ సిమెంట్ బ్లాక్స్ రక్షణ కవచంగా నిలుస్తాయి.

## అమల్లోకి ఈ ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 24, పెన్ పవర్:**సాధారణంగా మనం ఎవరిపైనైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే.. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదును స్వీకరించిన తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. ఎఫ్ఐఆర్ అంటే ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ అని తెలిసిందే. ప్రాథమిక సమాచారం ఆధారంగా తయారు చేసిన రిపోర్ట్. దాని తర్వాత ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తారు పోలీసులు. అయితే తాజాగా దేశంలోనే తొలి ఈ-ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అదే ఎలక్ట్రానిక్ ఎఫ్ఐఆర్. వాట్సాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు జమ్మూ కాశ్మీర్ పోలీసులు తొలిసారిగా ఎలక్ట్రానిక్ ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఇ-ఈఎఫ్ఐ) నమోదు చేశారు. డిజిటల్ పోలీసింగ్‌లో భాగంగా హంద్వారాలోని విల్గామ్ పోలీస్ స్టేషన్ వాట్సాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు తన మొదటి ఈ-ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.కుప్వారాలోని హంజిపోరా నివాసి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇంతియాజ్ అహ్మద్ దార్ ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. దార్ తరత్‌పోరా నుండి శ్రీనగర్‌కు ప్రయాణిస్తుండగా విల్గామ్ చేరుకున్న తర్వాత, విల్గామ్‌లోని పెహ్నిపోరా నివాసితులైన ఆషిక్ హుస్సేన్ భట్, గౌహెర్ అహ్మద్ భట్ అనే ఇద్దరు వ్యక్తులు తనను తప్పుగా నిర్బంధించి తనపై దాడి చేశారని ఇంతియాజ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయాన్ని అతను పోలీసులకు వాట్సాప్ ద్వారా తెలియజేశాడు. వాట్సాప్ ద్వారా వచ్చిన సమాచారంతో విల్గామ్ పోలీసులు బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత) సెక్షన్ల 115(2),126(2) కింద ఈ-ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు

# వీడిన రాజలింగమూర్తి హత్య కేసు

**కరీంనగర్, ఫిబ్రవరి 24 పెన్ పవర్:**రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన భూపాలపల్లి కి చెందిన రాజలింగమూర్తి ని హత్య కేసు మిస్టరీ వీడింది. నిందితులను పోలీస్ లు అరెస్ట్ చేశారు. రాజలింగమూర్తి హత్య కు భూవివాదాలే కారణమని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే చెప్పారు. రాజలింగమూర్తి మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ భూపాలపల్లి కోర్టులో కేసు వేయడంతో కేసీఆర్, హరీష్ రావు, మేడిగడ్డ నిర్మాణ సంస్థకు కోర్టు గతంలో నోటీసులు జారీ చేసింది. అయితే రాజలింగమూర్తి ఈ నెల 19 వ తేదీన హత్యకు గురైతే 20 వ తేదీన కోర్టులో మేడిగడ్డ పై విచారణ ఉండడంతో సంచలనంగా మారి రాజకీయ రంగు పులుముకుంది. రాజలింగమూర్తి ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హత్య చేయించాడని, వెంకటరమణారెడ్డికి కేసీఆర్, హరీష్ రావు సహకరించారని మృతుడి భార్య సరళ ఆరోపించారు. దీంతో హత్యపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను ఆమె డిమాండ్ చేశారు. రాజలింగమూర్తి ఈ నెల 19వ తేదీన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలని లో రాత్రి 8 గంటల సమయంలో దుండగులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. పతకం ప్రకారమే లింగమూర్తి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. హత్య జరిగిన మరుసటి రోజు భూ వివాదాల నేపథ్యంలోనే హత్యకు గురైనట్లు ప్రాథమిక విచారంలో తేలడంతో రేణుకుంట్ల సంజీవ్, పింగిళి శ్రీమంత్, మోరే కుమార్, కొత్తూరి కుమార్, రేణుకుంట్ల కొమురయ్యపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు పోలీస్ లకు సవాలుగా మారడంతో విచారణను వేగవంతం చేసి భూపాలపల్లి పోలీస్ లు అరెస్ట్ చేసిన ఏడుగురు నిందితుల, పరారీ లో ఉన్న నిందితుల పేర్లను భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే వివరించారు. ఏ1 రేణికుంట్ల సంజీవ్ (36), ఏ2 పింగిలి సీమంత్ (22), ఏ3 మోరె కుమార్ (35), ఏ4 కొత్తూరి కుమార్ (38), ఏ5 రేణికుంట్ల కొమురయ్య (60), ఏ6 దాసరపు కృష్ణ (45), ఏ7 రేణికుంట్ల సాంబయ్య (56) లని తెలిపారు.ఏ8 కొత్త హరిబాబు, భూపాలపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ (బీఆర్ఎస్), ఏ9 పుల్ల నరేష్, ఏ 10 పుల్ల సురేష్ పరారీలో ఉన్నారని పోలీస్ టీం లు గలిస్తున్నాయని ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి 2 కత్తులు, 2 రాడ్లు , 5 బైక్‌లు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నలుగురు కలిసి హత్య చేయగా.. ఇద్దరు రెక్కీలో పాల్గొన్నారని, మిగతా వారు నిందితులు హత్య చేసిన వారితో అటాచ్ లో ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. భూపాలపల్లి లోని ఎకరం భూమి విషయంలో రేణుకుంట్ల సంజీవ్ కుటుంబం సభ్యులకు, హత్యకు గురయిన రాజలింగమూర్తికి వివాదం కొనసాగుతుంది. ఈ భూమికి సంభందించి కోర్టులో సైతం కేసు కొనసాగుతుందని ఎస్పీ చెప్పారు. రాజలింగమూర్తిపై కక్ష తీర్చుకోవడానికి రేణుకుంట్ల సంజీవ్ కుటుంబం హత్య చేసినట్లు ఎస్పీ చెప్పారు. మూడు నెలల హత్యకు ప్లాన్ చేశారన్నారు.అయితే నిన్న ఆదివారం పోలీస్ లు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కిరణ్ ఖరే మీడియా కు చెప్పిన వెంటనే రాజలింగమూర్తి భార్య సరళ మీడియా సమావేశం పెట్టి హత్య కు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి కారణమని ఆయనకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లు సహకరించారని సరళ మరోసారి ఆరోపణలు చేశారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణం, అవకతవకలపై రాజలింగమూర్తి కేసు వేసినందుకే హత్య చేయించారని సరళ ఆరోపించారు. హత్యకు భూ వివాదం కారణం కానే కాదని ఆమె చెబుతున్నారు. కేసు విచారణకు వస్తున్న సమయంలో గండ్ర వెంకటరమణారెడ్డి అనుచరుడైన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హరిబాబుతో హత్యకు ప్లాన్ చేసి రాజలింగమూర్తిని చంపారని సరళ ఆరోపించారు. ముమ్మాటికీ గండ్ర వెంకటరమణ రెడ్డి, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లు చేయించిన హత్యేనని సరళ ఆవేదన వ్యక్తం చేశారు.

# పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు



పోలీస్ కమిషనర్ డాక్టర్. బి. అనురాధ

**సిద్దిపేట: పెన్ పవర్:**జిల్లా అధికారుల సమన్వయంతో కలిసి ఎన్నికలు నిర్వహిస్తున్నాం.163 బిఎన్ ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు.పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ.ఈ నెల 27న జరుగు పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్. బి. అను రాధ మాట్లాడుతూసిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 40, లొకేషన్లు 23.టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 27, లొకేషన్లు 27.మొత్తం పోలింగ్ స్టేషన్లు 67 అన్ని పోలింగ్ స్టేషన్లకు నెంబర్ మార్క్ చేయడం జరిగింది. పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ జియో ట్యాగింగ్ పూర్తి చేయడం జరిగింది. రూట్ మొబైల్స్ 8, స్ట్రైకింగ్ ఫోర్స్ 24, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ 3, ఎఫ్ఎస్టి వీఎస్టి టీమ్స్ 45, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి

ఏసీపీలు 3

సిఐలు10

ఎస్ఐలు 27,

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు 67, కానిస్టేబుళ్లు 312, మొత్తం పోలీస్ అధికారులు సిబ్బంది 419 మంది అధికారులు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, మరియు సిఐలు సర్కిల్ పరిధిలో ఏసీపీలు డివిజన్ పరిధిలో బందోబస్తు పర్యవేక్షణ చేస్తారని కమిషనర్ తెలిపారు.

**63 బిఎన్ ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు.**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు 27-02-2024 రోజు ఉన్నందున. ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు గాను, 25-02-2025 సాయంత్రం 4:00 గంటల నుండి, తేదీ 28-02-2025 ఉదయం 8:00 గంటల వరకు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల చుట్టూ 163 బిఎన్ ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినారు.

1 పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల చుట్టూ 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంది

2 ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువమంది కానీ గుంపులు గుంపులుగా తిరగవద్దు.

3 పార్టీ జెండాలు పార్టీ గుర్తులు ప్లే కార్డ్స్ ధరించవద్దు ప్రదర్శించవద్దు.

4 మైకులు లౌడ్ స్పీకర్లు వాడరాదు పాటలు ఉపన్యాసాలు ఇవ్వకూడదు.

6 ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటివి నిర్వహించడం నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. పోలీస్ కమిషనర్ తెలిపారు.

పట్టభద్రులు, టీచర్లు పోలీసుల సలహాలు సూచనలు పాటించి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని సూచించారు.

# ఎన్నికల బరిలో నిలబడని బీఆర్ఎస్ కు కాంగ్రెస్ ను ప్రశ్నించే అర్హత ఉందా..

**నిజామాబాద్: పెన్ పవర్:** పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థి గా నరేందర్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టింది.ప్రభుత్వానికి, పట్టభద్రులకు వారిధి గా ఉంటారనే నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా నిలబెట్టాం.బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు, కుతంత్రాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీన పర్చాలని ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నాడు అయన నిజామాబాద్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గోన్నారు. రేవంత్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ను ప్రజలు తిరస్కరించి , తెలంగాణ తో మీకు సంబంధం లేదని పేగు బంధం తెగిపోయిందని ఫామ్ హౌస్ పడుకోమని చెప్పారు. కేసీఆర్ అందుకే ఫామ్ హౌస్ లో పడుకున్నారు.. అయినా కుట్రలు ఆపలేదు. కాంగ్రెస్ ను గెలిపించి వద్దని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ వాళ్లు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని చెబుతున్నారు..? అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది.. పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది..ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేరు. ఎన్నికల్లో పోటీ చేయని పార్టీ కి రాజకీయ పార్టీ అని చెప్పుకునే అర్హత ఉందా..? తెలంగాణ ఉద్యమాన్ని పట్టభద్రులు ముందుండి నడిపారు. ఎన్నికల బరిలో నిలబడని బీఆర్ఎస్ కు కాంగ్రెస్ ను ప్రశ్నించే అర్హత ఉందా..? పది నెలలలో ఏమీ చేయలేని కాంగ్రెస్ ను అంటున్న బీఆర్ఎస్ పదేళ్లలో ఏం చేసింది..? ఎన్నికల కోడ్ కారణంగా ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు మాత్రమే మాకు పరిపాలన చేసే అవకాశం వచ్చింది.. పదేళ్లలో నిరుద్యోగ సమస్య కారణంగా అనేక మంది యువతీ యువకులు ఆత్మహత్య లు చేసుకున్నారు. పదేళ్లలో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగడమే సరిపోయింది.. నోటిఫికేషన్లు రాలేదు.. నియామకాలు చేయలేదని అన్నారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 55,163 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది నిజం కాదా..?



మేం 55 వేల ఉద్యోగాలు ఇస్తేనే కాంగ్రెస్ కు ఓటు వేయండి.. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం ఒలంపిక్స్ లో బంగారు పతకం తేలేకపోయింది. ప్రపంచంతో పోటీ పడలేక పోతున్నామనే తెలంగాణ లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిజామాబాద్ కు చెందిన నిక్కత్ జరీన్ కు రెండు కోట్ల నగదు ఇచ్చి గ్రూప్ 1 ఆఫీసర్ గా నియమించింది నిజమైతే కాంగ్రెస్ కు ఓటు వేయాలి. భారత బౌలర్ సిరాజ్ కు అన్ని మినహాయింపులు ఇచ్చి గ్రూప్ వన్ ఉద్యోగం ఇచ్చాం. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వం ఆదుకుంటుందని నిరూపించాం.

వరంగల్ కు చెందిన కీర్తి కి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చి 25 లక్షల ఆర్థిక సాయం చేశాం. నిజామాబాద్ రైతులు దేశానికి తలమానికం.. నిరసనలతో ప్రభుత్వాలను గడగడలాడించడంలో నిజామాబాద్ రైతులు ముందుంటారు. ఇరవై ఐదు లక్షల యాభై వేల మంది రైతులకు 21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తేనే కాంగ్రెస్ కు ఓటు వేయాలి. రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి యేడాదికి 12 వేలు ఇస్తున్నాం. నిజామాబాద్ లో కాంగ్రెస్ అనేక ప్రాజెక్టులు తీసుకురావడం వల్లనే పసిడి పంటలు పండుతున్నాయి. సన్న వడ్ల కు 500 రూపాయలు బోనస్ ఇస్తేనే కాంగ్రెస్ కు ఓటు వేయాలి . ఆర్థిక ఇబ్బందులను అధిగమించుకుంటు ప్రభుత్వాన్ని ముందుకు నడుపుతున్నాం. 8 వేల కోట్లు తీర్చుడానికి నా నడుము వంగిపోతోంది. ఖజానా ఖాళీ చేసి ఫామ్ హౌస్ కు పోయి పడుకుంటే బకాయిలు ఇవ్వడానికి మాకు చాలా కష్టం అవుతుంది. ప్రతి నెలా వెయ్యి కోట్ల బకాయిలు చెల్లించడానికి ప్రయత్నం చేస్తాం. మాటకు కట్టుబడే పార్టీ కాంగ్రెస్. బండి సంజయ్.. ఆకాశమంత ఎగిరి దూకుతున్నడు. బడా బీసీలమని బండి సంజయ్, మోదీ చెపుతున్నారు. 2021 లో బీజేపీ జనగణన ఎందుకు చేయలేదు.. అందులో కులగణన చేయలేదు. వందేళ్లలో బీసీ కులగణన చేయకపోతే మీ రేవంత్ రెడ్డి నెలలో కులగణన చేసి లెక్కలు ముందు పెట్టాడు. 100 యేళ్ల కులగణన సమస్యను నేను తీర్చాను. వండుకున్న అన్నం లో ఉప్పు వేసి తినకుండా చేయడానికి బీజేపీ నేతలు కుట్ర చేస్తున్నారు. బలహీన వర్గాలకు లెక్క తప్పు అయితే బండి సంజయ్.. ఎత్తి చూపించాలి.. సొల్లు వాగుడు వాగడం కాదు. సమగ్ర కుటుంబ సర్వే అనే చిత్తు కాగితాన్ని చూపిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ కు చట్టం చేసి మంత్రివర్గంలో ఆమోదించాం. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసింది రేవంత్ రెడ్డి కాదా..? వర్గీకరణ చేసింది రేవంత్ రెడ్డి అయితే కాంగ్రెస్ కు ఓటు వేయాలి. సమస్యకు పరిష్కారం చూపించిన నా వైపు దళిత సోదరులు నిలబడాలి. శాసనమండలి లో పట్టభద్రుల సమస్య ను ప్రస్తావించి పరిష్కరించే నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ కావాలని అన్నారు. .

# ఎమ్మెల్సీలకు నోటిఫికేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలుగు రాష్ట్రాల్లోని అధికార పార్టీ నేతలకు మరోసారి పదవుల పండుగ వచ్చింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీలో ఐదు, తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. పోలింగ్ అవసరం అయితే ఇరవయ్యో తేదీన జరుపుతారు. అదే రోజున ఫలితాలు వెల్లడిస్తారు. మార్చి 29వ తేదీన పది మంది ఎమ్మెల్సీలు రెండు రాష్ట్రాల తరపున పదవి విరమణ చేయనున్నారు.ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు కూటమికే దక్కనున్నాయి. యనమల, జంగా కృష్ణమూర్తి , డి.రామారావు, పి.అశోక్‌బాబు, తిరుమలనాయుడు పదవీకాలం ము?గుస్తోంది. వీరిలో ఒక్క జంగా కృష్ణమూర్తి తప్ప అందరూ టీడీపీకి చెందిన వారే. అయితే జంగా కృష్ణమూర్తి కూడా ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ఐదుగురు తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీల పదవి కాలం ముగుస్తోంది. ఇప్పుడు ఐదు ఎమ్మెల్సీ సీట్లు కూటమికే దక్కనున్నాయి. ఐదు సీట్లలో ఒకటి జనసేన పార్టీకి ఇంతకు ముందే ఖరారు చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి, పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఈ ఎమ్మెల్సీ సీటును ప్రకటించారు. తర్వాత ఆయనను మంత్రి వర్గంలోకి కూడా తీసుకోనున్నారు. బీజేపీకి ఏమైనా ఎమ్మెల్సీ సీట్లను కేటాయిస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఇటీవల రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజ్యసభ సీటును బీజేపీకి కేటాయించే అవకాశం ఉంటే.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ సీట్లను తెలుగుదేశం పార్టీ నాయకులకు కేటాయించే అవకాశం ఉంది. తెలంగాణలోనూ ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ కాలం ముగుస్తోంది. మహమ్మూద్ ఆలీ, సత్యావతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, యగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హస్సేన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. వీరిలో నలుగురు బీఆర్ఎస్ కు చెందిన వారు.. ఒకరు మజ్లిస్ కు చెందిన వారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు దక్కనున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బలా బలాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఒక సీటును మజ్లిస్ సాయంతో గెలుచుకోవచ్చు. అంటే బీఆర్ఎస్ ఒక్క సీటు లభిస్తుంది. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడం ఆ పార్టీకి మైనస్. మజ్లిస్ కు కాంగ్రెస్ పార్టీ ఓ సీటు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. అద్దంకి దయాకర్ , జీవన్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, నీలం మధు ముదిరాజ్, బస్వరాజ్ సారయ్య పేర్లు ప్రచారంలో ఉన్నాయి. బీఆర్ఎస్ తరపున ఎవరికి చాన్సిస్తారన్న దానిపై ఇంకా ఆ పార్టీలో ఎలాంటి చర్చ జరగడం లేదు. కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## పోలీస్ కస్టడీకి వంశీ

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు మూడు రోజుల పాటు ప్రశ్నించనున్నారు. కస్టడీ కోసం పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన ఎస్సీ, ఎస్టీ కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మూడు రోజుల పాటు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించేందుకు అనుమతి ఇచ్చింది. లాయర్ సమక్షంలో పోలీసులు కస్టడీలోకి తీసుకుని సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారంపై కీలక అంశాలను బయటకు తెచ్చే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీ ఆఫీసుపై దాడి వ్యవహారంలో సత్యవర్ధన్ అనే యువకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో వల్లభనేని వంశీ కూడా నిందితుడిగా ఉన్నారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించి..కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు తెచ్చుకున్నారు. అయితే హఠాత్తుగా ఓ రోజు సత్యవర్ధన్ తన పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లుగా కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఎవరికీ తెలియకుండా ఓ రోజు సాయత్రం కోర్టుకు వచ్చి జడ్జి ముందు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో కలకలం రేగింది. ఇది జరిగిన రెండు రోజులకే వల్లభనేని వంశీని హైదరాబాద్ లోని మైహోం భూజా అపార్టుమెంట్ లో విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసి బెదిరించి కేసును విత్ డ్రా చేసుకునేలా చేశారని కేసు పెట్టారు. అయితే సత్యవర్ధన్ ను తాను బెదిరించలేదని తనకేమీ తెలియదని వంశీ అంటున్నారు. అయితే సత్యవర్ధన్ ను వంశీ మైహోమ్ భూజాలోని తన ఇంట్లోకి తీసుకెళ్లి..తీసుకొస్తున్న దృశ్యాలను టీడీపీ నేతలు విడుదల చేశారు. కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన రోజున కూడా సత్యవర్ధన్ ను వంశీ అనుచరులే కోర్టుకు తీసుకు వచ్చారని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేయించడం.. కోర్టులో వాంగ్మూలం ఇప్పించడం వరకూ అన్ని అశాలపై వంశీ నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉంది. అదనంగా గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో వంశీ దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ ను కోర్టు కొట్టి వేసింది.

## ఆస్తి కోసం సోదరుడి హత్య

**కరీంనగర్, ఫిబ్రవరి 24, పెన్ పవర్:**జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన జంగిలి బసవయ్యకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. బసవయ్య కుమారుడు శ్రీనివాస్ ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేసేవాడు. మరో కుమారుడు గతంలోనే మరణించాడు. ముగ్గురు కూతుళ్లల్లో పెద్ద కుమార్తె భారతపు వరలక్ష్మి భర్త చనిపోవడంతో 22 ఏళ్లుగా పుట్టింట్లోనే తండ్రి దగ్గర ఉంటోంది. చిన్న కుమార్తె వొడ్నాల శారద కూడా భర్తను వదిలేసి తండ్రి వద్దే పుట్టింట్లో ఉంటోంది. ఈ ఇద్దరు బసవయ్యకున్న ఆస్తిలో భాగంగా ఇంటిపక్కనే ఉన్న వంద గజాల స్థలాన్ని తమకివ్వాలని తండ్రిని బలవంతం చేస్తున్నారు. కానీ, వందగజాల భూమిని కొడుకు శ్రీనివాస్‌కే రాసిస్తానని తండ్రి చెప్పడంతో.. అప్పట్నుంచీ గొడవ మొదలైంది. దాంతో వరలక్ష్మి, శారదా ఇద్దరూ కలిసి కోర్ట్ మెట్లెక్కారు. ఇప్పటికే ఈ కేసు కోర్టులో నడుస్తోంది.శ్రీనివాస్ ప్రస్తుతం హనుమాన్ వాడలో కిరాయి ఉంటుండగా.. ఆదివారం వేళ తల్లిదండ్రులను చూడ్డానికి పోచమ్మవాడలోని సొంత ఇంటికి వచ్చాడు. తండ్రితో మాట్లాడుతున్న క్రమంలో వరలక్ష్మి, శారదా కూడా మధ్యలో ఎంటరయ్యారు. దాంతో భూమి విషయంలో మాటామాటా పెరిగింది. ఇద్దరు చెల్లెళు కట్టెలందుకుని రోడ్డుమీదకు ఈడ్చి శ్రీనివాస్‌ను చితకబాదారు. దాంతో తలపైన గాయాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మూర్ఛబోగా? ఆసుపత్రికి తరలించారు. కానీ, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందడంతో ఈ ఘటన జగిత్యాలలో సంచలనంగా మారింది.పోచమ్మవాడలో ఉన్న వందగజాల స్థలం విలువ సుమారు 20 లక్షల వరకూ ఉండొచ్చునేమో. కానీ, నిత్యం కలిసుండే ఒకే కుటుంబంలో పట్టువిడుపుల్లేకుండా? కాంప్రమైజ్ అవ్వకుండా? ఒకరినొకరు అర్థం చేసుకునే పరిస్థితుల్లేకుండా నిత్యం గొడవ పడటం.. అది కాస్తా ముదిరి ప్రాణాలపైకే తేవడం బసవయ్య కుటుంబంలో తీవ్రవిషాదాన్ని రేపింది. మృతుడు శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు వరలక్ష్మి, శారదపై పోలీసులు మర్డర్ కేసు నమోదు చేశారు. మరోవైపు, నిందితులు వరలక్ష్మి, శారదా పోలీసుల ముందు లొంగిపోయారు. మొత్తంగా సభ్యసమాజం నివ్వెరబోయేలా చేసిన ఈ ఘటన మానవ సంబంధాలు రాను రాను ఎంతలా మసకబారిపోతున్నాయో చూపించింది.

# సొ'రంగం'లోకి ర్యాట్ హోల్ మైనర్స్..

## ఉత్తరాఖండ్ సొరంగం నుంచి 41 మందిని బయటికి తెచ్చింది వీళ్లే..!

- 8 మందిని రక్షించేందుకు ఆరుగురు మైనర్ల రెస్క్యూ
- ఎండోస్కోపిక్, రోబోటిక్ కెమెరాల ద్వారా టన్నెల్ స్థితిగతులపై అంచనా




హైదరాబాద్ పెన్ పవర్: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ లో చిక్కుకు పోయిన వారిని రక్షించేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ర్యాట్ హోల్ మైనర్స్ ను రంగంలోకి దించింది. 2023లో ఉత్తరాఖండ్ సిల్క్యారా సొరంగంలో 41 మంది కార్మికులు చిక్కుకోగా 17రోజులు ప్రయత్నించినా అధికారులు బయటికి తీసుకురాలేకపోయారు. చివరికి ఈ ర్యాట్ హోల్ మైనర్లు ఒక్కరోజులోనే వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చారు. ఎస్ఎల్ బీసీ వద్దకు చేరుకున్న ఆరుగురు ర్యాట్ హోల్ మైనర్స్.. టన్నెల్‌లో పరిస్థితులను తెలుసుకునేందుకు ఎండోస్కోపిక్, రోబోటిక్ కెమెరాలను పంపి పరిస్థితిపై ఒక అంచనాకు వచ్చారు.

**ఏమిటీ ర్యాట్ హోల్ సిస్టం**

ర్యాట్ హోల్ మైనింగ్ అనేది అత్యంత ప్రమాదకరమైన విధానం. మేఘాలయ వంటి రాష్ట్రాల్లోని బొగ్గు నిక్షేపాలున్న ప్రాంతాల్లో ఎలుక బోరియలు చేసినట్లుగా రంధ్రాలు తవ్వి.. భూగర్భం నుంచి బొగ్గును వెలికి తీయడాన్ని ర్యాట్ హోల్ మైనింగ్ అంటారు. ఇది అత్యంత ప్రమాదకరమైనప్పటికీ జీవనోపాధి కోసం వందల మంది ర్యాట్ హోల్ మైనింగ్ చేస్తున్నారు. 2019లో సుప్రీంకోర్టు ర్యాట్ హోల్ మైనింగ్ అక్రమమని, సురక్షితం కాదని కూడా ప్రకటించింది. ర్యాట్ హోల్ విధానం గురించి సింపుల్‌గా చెప్పాలంటే ఎలుకలు రంధ్రం చేసే విధంగా అన్నమాట. భూగర్భంలో లోతుకు ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా చెబుతుంటారు. నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉండే ఈ మార్గంలో ఒక్క మనిషి మాత్రమే పట్టేంత స్థలం ఉంటుంది. ఈ విధానం ద్వారా భూమి పైనుంచి లేదా సమాంతరంగా సన్నని మార్గాన్ని లోతుకు ఏర్పాటు చేసుకొని.. గనుల్లో బొగ్గు పొరను చేరుకున్న తర్వాత దాన్ని బయటకు తీసేందుకు సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ప్రత్యేక పనిముట్లతో చేతుల ద్వారానే ఈ విధానంలో తవ్వకాలు చేపడతారు. రోప్‌లు, నిచ్చెనల సాయంతో కొద్ది కొద్దిగా తవ్వుకుంటూ లోపలికి చేరుకుంటారు.

**ఇదీ తాజా పరిస్థితి**

ఎస్ఎల్బీసీ టన్నెల్ లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికులను బయటికి రప్పించేందుకు ప్రభుత్వం సైన్యాన్ని, డీఆర్ఎఫ్ ను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. 13 కి.మీ దూరం వద్ద టన్నెల కూలిన విషయం తెలిసిందే. అక్కడ బురద, నీళ్లు ఉండటంతో రెస్క్యూ ఆపరేషన్ టీం ముందుకు వెళ్లడం కష్టతరంగా మారింది. రెస్క్యూ టీమ్స్ అతి కష్టంగా వంద మీటర్ల దూరం ముందుకు వెళ్లగలిగాయి.

రబ్బరు పైప్స్ ద్వారా బురదను తొలగించడంతోపాటు తొలగించిన ప్రాంతంలో చెక్కలను అమర్చుతూ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని మంత్రి చెప్పారు. సొరంగం గోడలపై పగుళ్లు ఉన్నాయని, వాటి నుంచి నీరు లోనికి వస్తోందన్నారు.

# కుప్పకూలిన మార్కెట్లు.. లాంగ్ కన్సాలిడేషన్ తప్పదా.. ఇప్పుడు ఇన్వెస్టర్లు చేయాల్సింది ఇదే..!




హైదరాబాద్ పెన్ పవర్:ఇండియన్ స్టాక్ మార్కెట్లు ఇవాళ (ఫిబ్రవరి 24) భారీగా కుప్పకూలాయి. గత వారం పూర్తిగా వొలటైల్ గా ఉన్న మార్కెట్లు అప్పుడప్పుడు పాజిటివ్ సిగ్నల్స్ ఇస్తూ ఇన్వెస్టర్లలో ఆశలు క్రియేట్ చేశాయి. కానీ ఇవాళ ఓపెనింగ్ నుండే నెగెటివ్ గా స్టార్ట్ అవుతూ.. సెషన్ ఎండ్ అయ్యే టైమ్ కు భారీగా పడిపోయాయి.

నిఫ్టీ ఫిఫ్టీ 242.55 పాయింట్లు నష్టపోయి 22,553 కు చేరుకుంది. సెన్సెక్స్ 856.65 పాయింట్లు కోల్పోయి 74,454.41 వద్ద క్లోజ్ అయ్యింది. నిఫ్టీ ఇంపార్టెంట్ సపోర్ట్ 22,800 లెవల్ బ్రేక్ అయ్యి దూరంగా ఎండ్ అవ్వడం ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగిస్తోంది.

ఇవాళ్టి సెషన్ లో జొమాటో, హెచ్ సీఎల్, టీసీఎస్, టెక్ మహీంద్ర, హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. అదే సమయంలో సన్ ఫార్మా, మారుతి, ఎమ్ అండ్ ఎమ్, బజాజ్ ఫిన్ సర్వ్, నెస్లే ఇండియా లాభాల్లో ముగిశాయి.

**మార్కెట్ల పతనానికి కారణం:**

యూఎస్ ఎకానమీలో వస్తున్న స్లో డౌన్ తో ఇండియన్ మార్కెట్లు దారుణంగా పడిపోయాయి. యూఎస్ ఎకానమి స్లో డౌన్ కారణంగా యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉంది. దీంతో యూఎస్ లో పెట్టుబడులు పెడితే లాభం వచ్చే అవకాశం ఉందని ఫారిన్ ఇన్వెస్టర్లు ఎక్కువ మొత్తంలో ఇండియన్ మార్కెట్ నుంచి అమ్మకాలు జరుపుతున్నారు. అదే విధంగా యూఎస్ బాండ్ ఈల్డ్స్ పెరుగుతుండటం, ప్రపంచ ఆర్థిక స్థితి మందగనంలో ఉన్నపుడు స్థిరమైన లాభాలను ఇచ్చే బాండ్స్ లో ఇన్వెస్ట్ చేయడం బెస్ట్ ఆప్షన్ గా ఎఫ్ఐఐ (ఫారిన్ ఇన్వెస్టర్లు ) భావించి భారీగా అమ్మకాలకు దిగుతున్నారు. ఇండియన్ రూపీ భారీగా పతనం కూడా ఎఫ్ఐఐలు అమ్మకాలకు ఒక కారణం. రూపీ పతనంతో ఇండియాలో పెట్టిన పెట్టుబడులకు లాభాలు తగ్గడం సహజం. అదే టైమ్ లో డాలర్ పెరగ టం, బాండ్స్ నుంచి వచ్చే లాభాలు పెరుగుతాయనే ఆశాభావంతో ఇండియన్ మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు.

మరోవైపు రెసిప్రోకల్ టారిఫ్స్ పెంచుతున్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో కూడా ఇండియన్ మార్కెట్లు పతనం దిశగా వెళ్లాయి. యూఎస్ ఆర్థిక వ్యవస్థ స్లో డౌన్ వలన భారత్ - యూఎస్ ట్రేడ్ తగ్గుతుంది. ఇండియాకు అత్యధికంగా వాణిజ్యం ఉన్నది యూఎస్ తోనే. ఈ టైమ్ లో అమెరికా ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత కారణంగా వాణిజ్యంలో మందగమనం ఉంటుందని మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు వెళ్లిపోతున్నారు.

ఇటీవల విడుదలైన ఇండియన్ కంపెనీల రిజల్ట్స్ కూడా ఆశించినంత గొప్పగా ఉండక పోవడం, కంపెనీల రెవెన్యూ స్లో డౌన్ అవ్వడం కూడా పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. 2025లో మొత్తం లక్ష కోట్లకు పైగా (రూ.1,01,737 కోట్లు) అమ్మేశారు. దీంతో మార్కెట్లు ఘోరంగా పడిపోతున్నాయి.

**లాంగ్ కన్సాలిడేషన్ తప్పదా..?**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం అయిన నాటి నుంచి ఇండియన్ మార్కెట్లు స్లోగా ఫాల్ మొదలైంది. ఆ తర్వాత ఇటీవలే ట్రంప్ యూఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మార్కెట్లలో ఘోరమైన అమ్మకాలు జరుగుతున్నాయి. 26 వేల పైన ఉన్న నిఫ్టీ పడుతూ పడుతూ 23 వేల దిగువకు పడిపోయింది. అయితే 22,800 స్ట్రాంగ్ సపోర్ట్ కు దిగువన పడనంత వరకు ఎలాంటి భయం లేదని ఇప్పటి వరకు ఇన్వెస్టర్లు ధీమాగా ఉంటూ వస్తున్నారు.

పోర్ట్ ఫోలియోలు 30 నుంచి 70 శాతం పడిపోయినా.. 22,800 సపోర్ట్ బ్రేక్ కానంత వరకు ప్రాబ్లమ్ లేదని, అక్కడి నుంచి మళ్లీ మార్కెట్ పుంజుకుంటుందని ఎనలిస్టులు భావిస్తూ వచ్చారు. కానీ ఇవాళ ఈ సపోర్ట్ కూడా బ్రేక్ కావడంతో ఇక మార్కెట్ మరింత పడే ఛాన్స్ ఉందని అంటున్నారు. అయితే ఇక నుంచి కొన్నాళ్ల పాటు లాంగ్ కన్సాలిడేషన్ తప్పేలా లేదని అంటున్నారు. అంటే మార్కెట్లు పెరగకుండా ఒక రేంజ్ లో కొనసాగే అవకాశం ఉంది. కన్సాలిడేషన్ ఫేజ్ లో మార్కెట్లో అంతగా లాభాలు ఉండవు. దీంతో ఈ టైమ్ లో ఇన్వెస్టర్లు టైమ్ కరెక్షన్ ను చవిచూడక తప్పదు.

ఇన్వెస్టర్లు ఏం చేయాలి..?

నిఫ్టీ 22,800 సపోర్ట్ బ్రేక్ చేయడంతో ఈ ఫాల్ 22,700 వరకు ఉండవచ్చునని, అదీ బ్రేక్ అయితే 22,500 వరకు ఉండవచ్చునని అంటున్నారు. ఈ దశలో మార్కెట్ కన్సాలిడేషన్ లో ఉంటుందని అంటున్నారు. అది నెలలు కావచ్చు.. లేదంటే సంవత్సరాల పాటు కూడా కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఈ పరిస్థితుల్లో ఇక కొన్నాళ్లు లాభాలు రాని పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు ఏం చేయాలన్నదే ప్రశ్న.

కొత్తగా వచ్చిన రిటైల్ ఇన్వెస్టర్లు ఇక లాభాలు రావు అని ఎక్జిట్ అవ్వాలని చూస్తుంటారు. అయితే అలా చేయడం మరింత నష్టాన్నే ఇస్తుందని అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే పోర్ట్ ఫోలియోలు 30 నుంచి 70 శాతం నష్టాల్లో ఉన్నాయి. ఈ టైమ్ లో అమ్ముకుంటే ఆ నష్టాలను భరించాల్సి ఉంటుంది.

మరికొంత మంది మార్కెట్లు పడుతున్నాయి కదా అని మరింతగా యావరేజ్ చేద్దామని చూస్తుంటారు. బుల్ మార్కెట్లో యావరేజ్ చేయడం మంచి ఆలోచన. కానీ ఇప్పుడు నడుస్తున్న బేర్ మార్కెట్లో.. అదీ కన్సాలిడేషన్ స్టేజ్ లో యావరేజ్ చేయడం వలన లాభం లేదు. ఎందుకంటే ఇప్పట్లో మార్కెట్ ఎప్పుడు పెరుగుతుందో అంచనా వేయడం కష్టం. పెట్టుబడులు భారీగా పెట్టి యావరేజ్ చేయడం వలన చాలా రోజులు ఆ నష్టాల్లోనే ఉండాల్సి వస్తుంది. కొందరు వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతుంటారు. దీంతో వడ్డీ భారం పడక తప్పదు. అందుకే మార్కెట్ లో రివర్సల్ కన్ఫామ్ అయ్యే వరకు ఆగితే మంచిది. మార్కెట్లో బుల్ జోష్ వచ్చి.. ఇంపార్టెంట్ రెసిస్టెంట్స్ దాటి పెరగటం ప్రారంభిస్తే.. అది కన్ఫామ్ చేసుకుని అప్పుడు యావరేజ్, పిరమిడ్ చేసుకోవడం ఉత్తమం.